ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7

పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
ఆదివారం 13 ఏప్రిల్ 2025




# ప్రభుత్వ కళాశాలలు... ఫస్ట్

- ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రంలోనే జిల్లాకు ప్రథమ స్థానం
- ఉత్తమ మార్కులతో సత్తాచాటిన విద్యార్థులు

పార్వతీపురం/బెలగాం,ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. జిల్లాకు చెందిన ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారు. మంచి మార్కులతో అదరగొట్టారు. ఇంటర్ మొదటి సంవత్సరానికి సంబంధించి 1937 మంది పరీక్షలు రాయగా 1,349 మంది (70 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం 1605 మంది పరీక్షలకు హాజరవగా.. 1294 మంది (81 శాతం) పాసయ్యారు. మొత్తంగా జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలు ఇంటర్ ప్రథమ, ద్వితీయ ఫలితాల్లో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచాయి.

- ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలను కలిపి చూసుకుంటే ఇంటర్ మొదటి సంవత్సరం 5,867 పరీక్షలు రాయగా 4,519 మందికి ఉత్తీర్ణులయ్యారు. 77 శాతంతో రాష్ట్రంలో జిల్లా ఆరో స్థానంలో నిలిచింది. ద్వితీయ సంవత్సరం 5,335 మంది పరీక్షలు రాయగా 4,609 మంది ఉత్తీర్ణత సాధించి 86శాతంతో జిల్లా ఏడో స్థానాన్ని దక్కించుకుంది.

### ఆనందంగా ఉంది..



ఇంటర్‌లో జిల్లా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం ఆనందంగా ఉందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో కంటే మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేసిన అధ్యాపకులు, గురుకుల ఉపాధ్యాయులు, ఉన్నతాధికారులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఇలాంటి విజయాలను కొనసాగిస్తూ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

- జనరల్, ఒకేషనల్ విభాగంలో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలకు గాను మొత్తం 8,315 మంది విద్యార్థులు మొదటి సంవత్సరం పరీక్షలు రాయగా 6,582 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 8,318 మంది విద్యార్థులకు గాను 7,065 మంది ఉత్తీర్ణత సాధించారు. ఫస్ట్ ఇయర్‌లో 79 శాతం, సెకండ్ ఇయర్‌లో 84 శాతం ఉత్తీర్ణత సాధించారు.

### కళాశాలలు, స్కూళ్ల వారీగా..

- మొదటి సంవత్సరం ఇంటర్ పరీక్షలలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1,937 మంది విద్యార్థులు గాను 1,349 మంది, హైస్కూల్ ప్లస్‌లో 70 మందికి 54 మంది, కేజీబీవీల్లో 295 మందికి 276 మంది, మోడల్ స్కూళ్లలో 345 మందికి 284 మంది, సోషల్ వెల్ఫేర్ కళాశాలలో 286 మందికి 264 మంది, ట్రైబల్ వెల్ఫేర్ కళాశాలలో 947 మందికి 920 మంది, ప్రైవేట్ కళాశాలల్లో 1987 మందికి 1372 మంది ఉత్తీర్ణత సాధించారు.
- ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో ప్రభుత్వ కాలేజీల్లో 1605 మందికి 1294 మంది, కేజీబీవీల్లో 244 మందికి 237 మంది, మోడల్ స్కూళ్లలో 227 మందికి 209 మంది, సోషల్ వెల్ఫేర్‌లో 220 మందికి 212 మంది, ట్రైబల్ వెల్ఫేర్ లో 941 మందికి 930 మంది, ప్రైవేట్‌లో 2,098 మందికి 1727 మంది పాసయ్యారు.


పార్వతీపురం జూనియర్ కళాశాల

### మే 12 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

బెలగాం: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 12 నుంచి 20 వరకు జరుగుతాయని జిల్లా ఇంటర్ అధికారి మంజుల వీణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ సంవత్సరం వారికి ఉదయం 9 గంటల నుంచి 12 వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయని పేర్కొన్నారు. మే 28 నుంచి జూన్ వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. ప్రథమ సంవత్సరం వారికి ఉదయం 9 గంటల నుంచి 12 వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు ఈ పరీక్షలు జరగనున్నాయని చెప్పారు.


జిల్లా ఇంటర్ విద్యా శాఖాధికారి మంజుల వీణను సత్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

### డీఐఈవోకు కలెక్టర్ అభినందనలు

జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఇంటర్ ఫలితాలలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవడంపై కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో డీఐఈవో (జిల్లా ఇంటర్ అధికారి) మంజుల వీణను సత్కరించారు. పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామారావు, అధ్యాపకులకు అభినందనలు తెలిపారు. అధ్యాపకులు, సిబ్బంది కృషి కారణంగానే ఉత్తమ ఫలితాలు సాధించగలిగామని డీఐఈవో మంజుల వీణ తెలిపారు. ప్రభుత్వ సహకారంతో వచ్చే విద్యాసంవత్సరంలోనూ మరింత కష్టపడి మెరుగైన ఫలితాలు సాధిస్తామని ఆమె వెల్లడించారు.

## రెవెన్యూ సిబ్బందికి పదోన్నతులు



గరుగుబిల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పరిధిలోని రెవెన్యూ సిబ్బందికి పదోన్నతి కల్పించారు. ఈ మేరకు శనివారం ఆదేశాలు జారీ చేశారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల పరిధిలో 11 మంది జూనియర్ సహాయకులను సీనియర్ సహాయకులుగా పదోన్నతి కల్పిస్తూ విజయనగరం జేసీ ఎస్.సేతు మాధవన్ ఆదేశాలిచ్చారు. భోగాపురం తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న డి.సురేష్‌ను విజయనగరానికి, గరివిడి తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఎం.కిరణ్‌కుమార్‌ను విజయనగరం, గరుగుబిల్లికి చెందిన గులిపల్లి రవితేజకు పార్వతీపురం, విజయనగరంలో పనిచేస్తున్న బి.సతీష్‌కుమార్‌కు అదే పట్టణానికి , కొత్తవలస తహసీల్దార్ కార్యాలయంలోని ఎస్.షణ్ముఖ రావుకు విజయనగరం, మన్యం కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్న టి.రామారావుకు పార్వతీపురం కేటాయించారు. సీతానగరానికి సంబంధించి డి.షణ్ముఖ పట్నాయక్‌ను పార్వతీపురానికి, విజయనగరం ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్న కె.భరత్‌కుమార్‌ను విజయనగరం కలెక్టరేట్‌కు, విజయగరం ఆర్డీవోలో పనిచేస్తున్న బి.రామమూర్తి శాస్త్రిని ఆ జిల్లా కలెక్టరేట్‌కు, జియ్యమ్మవలసకు చెందిన సీహెచ్ ఆదిలక్ష్మిని పార్వతీపురం, మన్యం కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్న ఎం.మంజూషకు పార్వతీపురం ఆర్డీవో కార్యాలయానికి కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేశారు. కొద్ది రోజుల్లో వారు విధుల్లో చేరనున్నారు.

## సచివాలయ ఉద్యోగుల్లో.. గందరగోళం




- హేతుబద్ధీకరణలో నిర్దిష్ట ప్రయోజన ఉద్యోగుల కేటాయింపులో స్పష్టత కరువు
- ఏడుగురు గ్రామ, ఆరుగురు వార్డు సచివాలయాల్లో విధులు
- వీరిలో నలుగురికే బాధ్యతలట
- ఇప్పటికే సాధారణ ప్రయోజన ఉద్యోగులను తగ్గించిన ప్రభుత్వం

శృంగవరపుకోట, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల హేతుబద్ధీకరణకు గురువారం విడుదల చేసిన ఉత్తర్వులతో ఉద్యోగులు కలవరపడుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎక్కడ చూసినా ఇదే చర్చ. జీవోతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన జాబితాలో సచివాలయం నుంచి తప్పించినట్లు పేర్కొన్న సాధారణ ప్రయోజన ఉద్యోగులంతా 'మన పరిస్థితేంటి అంటూ' ఒకరికొకరు వాకబు చేసుకుంటున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లోనే ఉంచుతారా? మరేదైనా శాఖలో వీలినం చేస్తారా? అంటూ తమకు పరిచయం ఉన్న ఉన్నతాధికారులతోనూ మాట్లాడుతున్నారు. ఇక నిర్దిష్ట ప్రయోజన ఉద్యోగుల్లో ఏ శాఖకు చెందిన ఉద్యోగులు సచివాలయాల్లో పని చేయాల్లో స్పష్టంగా చెప్పకపోవడంతో వైద్య ఆరోగ్య శాఖకు చెందిన ఏఎన్ఎంలు తప్ప మిగిలిన శాఖలకు చెందిన ఉద్యోగులంతా టెన్షన్ పడుతున్నారు. గ్రామ వార్డు సచివాలయాల్లో 'మీ శాఖ ఉద్యోగులు ఉంటారని ఒకరంటే మీ శాఖకు చెందిన ఉద్యోగులను ఉంచే అవకాశం ఉందని' మరో శాఖకు చెంది ఉద్యోగులు బదులిస్తున్నారు. రెండు సచివాలయాలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేస్తున్నందున అన్నిశాఖల ఉద్యోగులకు ఏదో ఒక సచివాలయంలో బాధ్యతలు అప్పగిస్తారని అధికార యంత్రంగం చెబుతోంది. ఎవరూ భయపడాల్సిన పని లేదని ఇందుకు సబంధించిన పూర్తి కార్యాచరణ ప్రణాళికను ప్రభుత్వం రూపొందిస్తోందంటున్నారు.

జీవోతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేయాల్సిన సాధారణ ప్రయోజన ఉద్యోగుల వివరాలతో జాబితాను తయారు చేశారు. ఏ కేటగిరీకి చెందిన ఒక సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌లను ఉంచితే, మరో సచివాలయంలో పంచాయతీ సెక్రటరీ, మహిళ పోలీస్‌లను

(మిగతా 10వ పేజీలో...)



**పార్వతీపురం మన్యం జిల్లా**

| కేటగిరీ | గ్రామ సచివాలయాలు | వార్డు సచివాలయాలు |
|---|---|---|
| ఏ | 89 | 2 |
| బీ | 86 | 14 |
| సీ | 45 | 13 |
| మొత్తం | 220 | 29 |

## చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్మోహనరావు

సీతానగరం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనపర్చాలని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహనరావు సూచించారు. శనివారం బుడ్డిపేట గ్రామంలో టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. జాబితాను పరిశీలించి షెడ్యూల్ ప్రకారం టీకాలు వేస్తున్నారా? లేదా అనేది అడిగి తెలుసుకున్నారు. పిల్లల వయస్సును గమనించారు. టీకా వేసిన వివరాలను యూవిన్, ఆర్‌సీహెచ్ పోర్టల్స్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతి నెలా పిల్లల బరువు, ఎత్తు నివేదికలు కచ్చితంగా నమోదు చేయాలన్నారు. ఐరన్ సిరప్‌ను వారానికి రెండు సార్లు ఒక ఎంఎల్ చొప్పున తప్పనిసరిగా వేయించాలని సూచించారు. ఎండల తీవ్రత దృష్ట్యా పిల్లలు డీహైడ్రేషన్‌కు గురికాకుండా సిబ్బంది, తల్లిదండ్రులు జాగ్రత్త పడాలన్నారు. వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, పిల్లల ఆరోగ్యాన్ని తరచుగా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో ఏఎన్ఎం పి.సింహాచలం, ఎంఎల్‌హెచ్‌పీ సంధ్య తదితరులు ఉన్నారు.


పిల్లల ఎత్తును పరిశీలిస్తున్న దృశ్యం

## స్త్రీ నిధితో జీవనోపాధికి బాటలు

- సెర్ప్ అడిషనల్ సీఈవో శ్రీరాములునాయుడు

సాలూరు రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): స్త్రీ నిధి బ్యాంక్‌ను స్వయం సహాయక సంఘాలు వినియోగించుకుని జీవనోపాధులకు బాటలు వేసుకోవాలని సెర్ప్ రాష్ట్ర అడిషనల్ సీఈవో కె.శ్రీరాములు నాయుడు సూచించారు. పందిరి మామిడివలసలో అప్పులు, జీవనోపాధులపై శనివారం నిర్వహించిన సర్వేను పరిశీలించారు. అనంతరం గ్రామ మహిళలతో సమావేశమయ్యారు. స్త్రీ నిధి బ్యాంక్‌లో డిపాజిట్లు చేసుకోవచ్చని, తక్కువ వడ్డీకే రుణాలు పొందొచ్చని తెలిపారు. ఎస్‌హెచ్‌జీలు అంతర్గత రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు గతంలో తీసుకున్న రుణాలను ఏ విధంగా సద్వినియోగం చేసుకున్నారో తెలుసుకోవడానికే సర్వే చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్రక్రియను ఎన్యూమరేటర్లు పక్కాగా చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట డీఆర్‌డీఏ పీడీ సుధారాణి తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న సెర్ప్ అడిషనల్ సీఈవో

## పర్యవేక్షణ లేక.. పక్కదారి పట్టి

- శివ్వాంలో జేజేఎం పైపులైన్లకు గండి కొట్టి పెరటి తోటలకు నీరు మళ్లింపు
- నీరుగారుతున్న పథకం లక్ష్యం

10లో

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ: ఎస్పీ

10లో

తోటపల్లిలో భక్తుల సందడి



## అంతరాయం కలిగితే ఊరుకునేది లేదు

- తాగునీటి సరఫరాపై కమిషనర్ హెచ్చరిక

పార్వతీపురం టౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలోని 30 వార్డుల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలిగితే ఊరుకునేది లేదని కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. శనివారం జిల్లా కేంద్రంలో నీటి సరఫరా, పైప్‌లైన్ లీకులను పరిశీలించారు. తాగునీటి సరఫరా చేసే సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలని, సంబంధిత అధికారులు పక్కా ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని సూచించారు. పైప్‌లైన్లు లేని శివారు కాలనీలకు ట్యాంకర్లు పంపించాలన్నారు. మున్సిపాలిటీలో నీటి ఎద్దడి నివారణకు రూ.25లక్షలతో ప్రణాళికలు రూపొందించామని వెల్లడించారు. వార్డుల్లో నీటి సమస్యలుంటే వెంటనే మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులకు తెలియజేయాలని సూచించారు.


ఇంజనీరింగ్ సిబ్బందిని హెచ్చరిస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్లు

## శిఖపరువు జలపాతం అభివృద్ధికి చర్యలు

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

సాలూరు రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): సాలూరు మండలంలో ఉన్న శిఖపరువు జలపాతం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. పీపీపీ (పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్ షిప్) పద్ధతిలో పర్యాటక ప్రాంతంగా మార్చేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామన్నారు. శనివారం సాయంత్రం శిఖపరువు జలపాతాన్ని ఆయన పరిశీలించారు. జలపాతంలో దిగి స్నానం చేశారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయన్ను కలిసి అభివృద్ధి విషయమై ప్రస్తావించారు. స్థానికులు సహకరిస్తే అభివృద్ధికి తగిన ప్రణాళికలు రూపొందిస్తామని కలెక్టర్ తెలిపారు. జలపాతం వద్ద ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడారు. మెట్ల నిర్మాణం, హెచ్చరిక బోర్డులు, భద్రత తదితర అంశాలపై ప్రజల అభిప్రాయాలను సేకరించారు. ఆయన వెంట సాలూరు తహసీల్దార్ ఎన్వీ రమణ, వీఆర్వో శ్రీనివాసరావు, ఎస్ఐ నర్సింహమూర్తి, వెలుగు ఏపీఎం జయమ్మ తదితరులు ఉన్నారు.

### స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాల కార్యచరణ ప్రణాళిక కింద ఎస్సీ యువత నుంచి స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 266 యూనిట్లను రూ.11.03 కోట్లతో ఏర్పాటు చేయడానికి అవకాశాలున్నాయని పేర్కొన్నారు. ఇందులో సబ్సిడీ రూ.4.34 కోట్లు కాగా బ్యాంకు లోన్ రూ.6.14 కోట్లు, లబ్ధిదారుని వాటా రూ.55.14 లక్షలుగా ఉంటుందని వివరించారు. అర్హులైన ఔత్సాహిక షెడ్యూల్డ్ కులాల నిరుద్యోగ యువతీ యువకులు వచ్చేనెల పదో తేదీ లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. హెచ్‌టీటీపీఎస్// ఏపీవోబీఎంఎంఎస్. ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా మరిన్ని వివరాలను తెలుసుకోవచ్చన్నారు. ఈ నెంబర్ల 96424 60838, 98499 05958కు కూడా ఫోన్ చేయొచ్చని సూచించారు.


జలపాతం వద్ద స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్

# ఇంటర్‌లో ప్రభుత్వ కళాశాలల సత్తా

ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లాలో ప్రభుత్వ కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు సత్తా చాటారు. ఎంపీసీ, బైపీసీతో పాటు సీఈసీ, హెచ్ఈసీలోనూ మంచి మార్కులు సాధించారు. కొన్ని పాఠశాలలు శతశాతం ఉత్తీర్ణత సాధించడం గమనార్హం.

### గురుగుబిల్లిలో..

గరుగుబిల్లి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మండలం లోని ప్రభుత్వ కళాశాలల విద్యార్థినులు ఇంటర్‌లో శత శాతం ఉత్తీర్ణత సాధించారు. రావివలసకు కేజీబీవీకి సం బంధించి మొదటి ఇంటర్‌లో 39 మంది పరీక్షలు రాయగా 39 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ ఇంటర్‌కు సంబంధించి 38 మందికి గాను 38 మంది ఉత్తీర్ణత సాధించారని ప్రత్యేకాధికారిణి ఎస్.ఛాయాదేవి తెలిపారు. ద్వితీయ సంవత్సరం లో పి.సమర 954 మార్కులు సా ధించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలలో శతశాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ ఎస్.సంధ్యారాణి తెలిపారు. ఎంపీసీకి సంబం ధించి పి.మేఘన 972 మార్కులు, వి.విమల 962, కె.సంపూర్ణ 958, బైపీసీలో వి.కల్యాణి 963 మార్కులు, కె.స్రవంతి 963, బి.సంజన 959, బి.లలిత 950, వై.కల్పన 950 మార్కులు సాధించారని తెలిపారు.



విద్యార్థినులను అభినందిస్తున్న దృశ్యం

## కురుపాం కేజీబీవీలో శతశాతం ఉత్తీర్ణత

కురుపాం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో స్థానిక ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఏపీ మోడల్ స్కూల్ ఇంటర్ ద్వితీయ ఎంపీసీ విద్యార్థిని పి.జోషిత 969, డి.మల్లిక 959 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం బైపీసీ విద్యార్థిని ఎస్.శ్రీలేఖ 457 వి.కీర్తిప్రియ 454 మార్కులు సాధించారు. కేజీబీవీ పాఠశాల విద్యార్థినులు ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలలో శతశాతం ఉత్తీర్ణత సాధించారు.



పి. జోషిత



డి.మల్లిక

### వేపాడలో...

వేపాడ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): స్థానిక బక్కునాయుడుపేట వద్ద గల ఏపీ గురుకుల బాలికల పాఠశాలలో మొదటి సంవత్సరం పరీక్షలను 75 మంది రాయగా...అందరూ ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలకు 62 మంది హాజరు కాగా...అందరూ ఉత్తీర్ణులయ్యారు. మొదటి సంవత్సరం బైపీపీలో ఎం.సిరివెన్నెల 416 మార్కులు సాధించింది. ఎంపీసీలో ఎస్.సౌజన్య 454 మార్కులు సాధించింది. రెండో సంవత్సరం ఎంపీసీలో మొయ్యి కావయ్య 961 మార్కులు, టి.ఇక్షిత బైపీసీలో 954 మార్కులు సాధించారు. కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల నుంచి మొదటి సంవత్సరం పరీక్షలను 39 మంది రాయగా.. అందరూ ఉత్తీర్ణులయ్యారు. రెండో సంవత్సరం పరీక్షలకు 18 మంది హాజరు కాగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. స్థానిక ఆదర్శ పాఠశాలకు చెందిన పి.అఖిల ద్వితీయ బైపీసీలో 939 మార్కులు సాధించింది. మొదటి సంవత్సరం ఎంపీసీలో వచ్చిన లోకేష్‌కు 456, వడవంటి సంధ్యకు 446, బైపీసీలో మంచిన వాణికి 416 మార్కులు వచ్చాయి.



డి.దివ్య



వాణి

### భోగాపురంలో..

భోగాపురం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయంలో ద్వితీయ సంవత్సరం బైపీసీ విద్యార్థులు 27 మంది పరీక్షలకు హాజరుకాగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. వి.గౌతమి 887, ఎం.పూజ 869 మార్కులు సాధించారు. ఏపీ మోడల్‌స్కూల్‌కు చెందిన ఎం.దేవేంద్ర ఎంపీసీలో 973 మార్కులు సాధించాడు.

### మెరకముడిదాంలో...

మెరకముడిదాం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): గర్భాం మోడల్ స్కూల్ విద్యార్థిని తాడ్డి తనూజ ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీలో 987 మార్కులు సాధించింది. ఎంపీసీలో ఎ.పవిత్ర 981 మార్కులు సాధించింది. ప్రథమ సంవత్సరం సీఈసీలో పి.కుసుమకుమారి 430, ద్వితీయ సీఈసీలో అరుణ 902 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో వి.భాగ్యలక్ష్మి, జి.పావని 433 మార్కులు చొప్పున సాధించారు. ప్రథమ సంవత్సరం బైపీసీలో వై.వైష్ణవి 429 మార్కులు సాధించింది. సోమలింగాపురం ప్రభుత్వ కళాశాలలో ద్వితీయ బైపీసీ విద్యార్థిని మండల సౌమ్య 967, లంక కల్యాణి 933 మార్కులు సాధించినట్టు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు.



మండల సౌమ్య



తనూజ

### కొమరాడలో...

కొమరాడ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం పరీక్షా ఫలితాల్లో కొమరాడ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల కళాశాల విద్యార్థినులు సత్తా చాటారు. మొదటి సంవత్సరం 73 మంది, ద్వితీయ సంవత్సరం 61 మంది పరీక్షలకు హాజరవ్వగా అందరూ ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ ఎల్.పద్మావతి తెలిపారు. బైపీసీలో దుర్గాభవాని 974 మార్కులు సాధించినట్టు వైస్ ప్రిన్సిపాల్ రజని చెప్పారు. కేజీబీవీ కళాశాలలో మొదటి సంవత్సరం వంద శాతం ఉత్తీర్ణత సాధించగా, ద్వితీయ సంవత్సరంలో 97.4 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ కె.అరుణ చెప్పారు.



దుర్గాభవాని

### జియ్యమ్మవలసలో...

జియ్యమ్మవలస, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూపులో 31 మంది, బైపీసీలో 30 మంది పరీక్ష రాయగా, అందరూ ఉత్తీర్ణులైనట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. కె.మణిదీప్ ఎంపీసీలో 443 మార్కులు సాధించారు. బైపీసీలో జె.శిరీష 440 మార్కులకు గాను 413 మార్కులు సాధించింది. ద్వితీయ సంవత్సరం బైపీసీలో పడాల జనప్రియ 927 మార్కులు సాధించింది.



కె.మణిదీప్



పి.జనప్రియ

### పార్వతీపురంలో..

పార్వతీపురం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఐటీడీఏ పరిధిలోని గురుకుల కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు మంచి ఫలితాలను సాధించారు. జోగంపేట స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు చెందిన జయకర్ బైపీసీలో 979 మార్కులు సాధించాడు. పాచిపెంట మండలం పి.కోనవలసకు చెందిన గురుకుల విద్యార్థి ఆర్.రాకేష్ ఎంపీసీలో 979 మార్కులు సాధించాడు. జోగెంపేట స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కురుపాం ప్రభుత్వ కళాశాల విద్యార్థినులు నూటికి నూరు శాతం ఫలితాలను సాధించారు. ఒకేషనల్‌లో ఎస్.దమంతి 928 మారులు సాధించింది. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో డి.ఉజ్వల 434 మార్కులు సాధించింది. ఒకేషనల్‌లో ఎస్.యాష్‌కుమార్ 481 మార్కులు సాధించాడు. వీరిని ప్రిన్సిపాల్ హరగోపాల్, సిబ్బంది అభినందించారు.

### పాలకొండలో..

పాలకొండ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాలల బైపీసీ గ్రూప్‌లో ఎస్.రాణి 931 సాధించింది.

### రామభద్రపురంలో..

రామభద్రపురం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): బూసాయవలస కేజీబీవీ విద్యార్థినిలు ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 33 మంది పరీక్షలు రాయగా...అందరూ ఉత్తీర్ణులయ్యారు. వీరిలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీలో బసవ షర్మిల 963 మార్కులు, రాంబార్కి హారిక 929 మార్కులు సాధించారు. అలాగే ఇంటర్ ప్రథమ సంవత్సరం బైపీసీలో శనపతి షర్మిల 414, ఎస్.మోహిని 388 మార్కులు సాధించారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.దీపవల్లి అభినందించారు.

### భామినిలో..

భామిని, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): భామిని మోడల్ స్కూల్ జూనియర్ కాలేజ్-2 ఇంటర్ విద్యార్థిని గవర సాయి గీత ద్వితీయ ఎంపీసీలో 972 మార్కులు సాధించింది. ఆమె పెద్దదిమిలి గ్రామానికి చెందిన రైతు కృష్ణారావు, స్వాతి దంపతుల కుమార్తె. సీఈసలో ముర్ల తేజేస్విని 937 మార్కులు సాధించింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపీసీలో గంగ 956, ఎంపీసీలో ఎన్.కీర్తి 941 మార్కులు సాధించారు.



సాయిగీతను అభినందిస్తున్న దృశ్యం

### నెల్లిమర్లలో...

నెల్లిమర్ల, ఏప్రిల్ 12(ఆంధ్ర జ్యోతి): నెల్లిమర్లలోని సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ ఎంపీసీ విద్యార్థిని కె.వెంకటలక్ష్మి 952 మార్కులు సాధించింది. ఎంజేపీఏపీ బాలికల గురుకుల కళాశాల విద్యార్థినులు శత శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీలో వేమల కీర్తన 982 మార్కులు, బైపీసీలో బండి శాంతి, ఎం.హాసిని 980 మార్కులు, సీఈసీలో మజ్జి త్రివేణి 956 మార్కులు సాధించారు. ఇంటర్ ద్వితీయలో 91 మంది హాజరవగా, అందరూ ఉత్తీర్ణత సాధించారని కళాశాల వర్గాలు తెలిపాయి. సతివాడ ఆదర్శ పాఠశాలలో ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో డి.ఆరుద్ర 964 మర్కులు, బైపీసీలో పి.ఆశిష్ 961, మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు.



వేమల కీర్తన



బండి శాంతి



ఎం.హాసిని

### పాచిపెంటలో...

పాచిపెంట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): జి.కోనవలస గిరిజన బాలుర సంక్షేమ కళాశాలకు చెందిన బంటి రాకేష్ ఎంపీసీ గ్రూపులో 979 మార్కులు సాధించాడు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరానికి గాను గెమ్మెల వేణు హెచ్ఈసీ గ్రూపులో 493 మార్కులు సాధించాడు



బంటి రాకేష్



గెమ్మెల వేణు

### బొబ్బిలిలో...

బొబ్బిలి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి కేజీబీవీలో ద్వితీయ సంవత్సరం ఎంపీహెచ్‌డబ్ల్యు గ్రూపులో ఇ.రాజేశ్వరి 909 మార్కులు సాధించినట్టు ప్రిన్సిపాల్ స్వప్న తెలిపారు. ప్రథమ సంవ్సతరంలో పి.నీహారిక 478 మార్కులు సాధించినట్లు ఆమె తెలిపారు.

### బాడంగిలో..

బాడంగి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి):బాడంగి సాంఘికసంక్షేమశాఖ గురుకుల కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సర ఫలితాల్లో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. మొత్తం పరీక్షలు రాసిన 15 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సరంలో పరీక్షలు రాసిన 41 మందిలో 35 మంది (85.36 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీలో మీనాక్షి 941 మార్కులు, బైపీసీలో ప్రియాంక 960, ఝాన్సీ 955 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు.



కేజీబీవీ విద్యార్థినుల విజయోత్సాహం

### మక్కువలో...

మక్కువ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ములక్కాయవలస ఆదర్శ పాఠశాలలో ప్రథమ సంవత్సరం ఎంపీసీలో బి.అశ్విని 435 మార్కులు సాధించింది. బైపీసీలో ఏ.దేవీ ప్రియ 423 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 52 మంది విద్యార్థులు హాజరుకాగా, అందరూ ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీలో సొంగలి చూర్ణిత 977 మార్కులు సాధించింది. బైపీసీలో టి.జ్ఞానేశ్వరి 980 మార్కులు సాధించింది. కాశీపట్నం కేజీబీవీ పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 37 మంది హాజరుకాగా అందరూ ఉత్తీర్ణత సాధించారు. బైపీసీలో జి.నందిని 425 మార్కులు సాధించింది. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 35 మంది హాజరు కాగా...అందరూ ఉత్తీర్ణత సాధించారు. ఆర్.శాంతికుమారి 970 మార్కులు సాధించింది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం బైపీసీలో సి.హెచ్.సూర్యలక్ష్మి 423 మార్కులు సాధించింది. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో ఎన్.రాజేష్ 907, బైపీసీలో ఎం.అరవింద్ 924 మార్కులు సాధించారు.

### ప్రేమతత్వమే మంచిది

విజయనగరం బాబామెట్ట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రతీకారం వద్దని..ప్రేమతత్వమే ముద్దని పాస్టర్లు తెలిపారు. స్థానిక స్విమ్స్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చిలో శనివారం ప్రవీణ్ ప్రగడ ఆత్మశాంతి కోసం ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కార్యదర్శి సంఘమిత్ర ఆర్ఎస్ జాన్, రెవరెండ్ ప్రభాకర్ తదితరులు మాట్లాడారు.



హనుమంతునికి పూజలు చేసిన దృశ్యం

## వైభవంగా హనుమాన్ జయంతి

విజయనగరం రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రామభక్తుడు హనుమాన్ జయంతిని జిల్లా వ్యాప్తంగా శనివారం వైభవంగా నిర్వహించారు. హనుమాన్ ఆలయాల్లో సింధూరం, తమల పాకులతో అర్చనలు చేశారు. సాయంత్రం హనుమాన్ భక్తులు విజయనగరంలో వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. జై హనుమాన్, జై శ్రీరామ్ అంటూ భక్తుల నినాదాలతో విజయనగరం పులకించిపోయింది. విజయనగరం, నెల్లిమర్ల, గుర్ల, గరివిడి, చీపురుపల్లి, దత్తిరాజేరు, గంట్యాడ, ఎస్.కోట, రాజాం, బొద్దాం, గుళ్ల సీతారామపురం, గజపతినగరం తదితర ప్రాంతాల్లోనూ హనుమజ్జయంతిని నిర్వహించారు. స్థానిక దాసన్నపేటలోని పురాతన ఆంజనేయ స్వామి ఆలయం, జగన్నాథస్వామి ఆలయం ఆవరణలో ఉన్న చిన్న అంజనేయ స్వామి ఆలయంలో తమలపాకులు, సింధూరంతో అర్చన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కొత్తపేట కుమ్మరవీధిలోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అయ్యకోనేరు గట్టు మీద ఉన్న ఆంజనేయ స్వామి తదితర ఆలయాల్లో హనుంతుడికి అభిషేకాలు చేశారు.



వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు

## లాన్ టెన్నిస్ పోటీలు ప్రారంభం

విజయనగరం రూరల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): సుమారు పదేళ్ల విరామం తరువాత సిటీక్లబ్ జిల్లా స్థాయి పోటీలకు ఆతిథ్యమిచ్చింది. అండర్-12, అండర్-16, 30 ప్లస్, 40 ప్లస్, 50 ప్లస్ విభాగాల్లో ఈ పోటీలను నిర్వహించారు. ఐదు విభాగాల్లో 62 మంది పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలను జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఛైర్మన్, సిటీక్లబ్ ప్రతినిధి రంగారావు దొర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల విరామం తరువాత సిటీక్లబ్‌లో టెన్నిస్ పోటీలు నిర్వహించడం హర్షణీయమన్నారు. సీనియర్ క్రీడాకారులు సన్యాసిరాజు, రామరావు, శంకరరావు తదితరులు మాట్లాడుతూ, రానున్న కాలంలో ఉత్తరాంధ్ర స్థాయి, రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణకు ప్రయత్నించాలని సూచించారు.

### ఉత్సాహంగా తొలి రోజు పోటీలు

నగరంలోని సిటీక్లబ్‌లోని రెండు క్లే కోర్టుల్లో తొలిరోజు ఉదయం, సాయంత్రం ఐదు విభాగాల్లో 18 మ్యాచ్‌లు జరిగాయి. ఆదివారం రెండో రోజు సెమిఫైనల్స్, ఫైనల్స్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ పోటీలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో క్రీడాభిమానులు హాజరయ్యారు.



పోటీలను ప్రారంభిస్తున్న సిటీ క్లబ్ ప్రతినిధి రంగారావు దొర

## నోస్టాక్





- జిల్లాలో నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కొరత
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

విజయనగరం క్రైం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నాన్ జ్యుడీషియల్ పది రూపాయల స్టాంపుల కొరత అందరినీ వేధిస్తోంది. మార్చి 17 తరువాత నుంచి తిరిగి స్టాక్ రాలేదు. జిల్లాలో 11 రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా వీటి పరిధిలో 52 మంది జ్యుడీషియల్ స్టాంపులు అమ్మే వెండర్లు ఉన్నారు. జిల్లా కేంద్రమైన విజయనగరంలో దాసన్నపేట, కణపాక ప్రాంతాల్లో వెండర్లు ఉన్నారు. బొబ్బిలి, భోగాపురం, చీపురుపల్లి, గజపతినగరం, కొత్తవలస, నెల్లిమర్ల, ఎస్‌కోట, తెర్లాం, రాజాం తదితర ప్రాంతాల్లోనూ వెండర్లు ఉన్నా నాన్ జుడీషియల్ స్టాంపుల కొరత తీవ్రంగా ఉంది. రూ.10 స్టాంపులు ఎక్కువ మంది వినియోగిస్తుంటారు. సాధారణ విషయాలకు కూడా రూ.10 స్టాంపు వినియోగించడమే కొరతకు కారణం. రూ.10 స్టాంపుల కొరత వున్న కారణంగా అవసరం లేకపోయినా రూ.20 లేదా రూ.50 స్టాంపులను, కొంతమంది రూ.100 స్టాంపులను వినియోగిస్తున్నారు. వెండర్స్ ఎవరి వద్దనైనా రూ.10 స్టాంప్ ఉంటే అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. నాన్ జ్యుడీషియల్ రూ.10 స్టాంపుల కొరత కారణంగా ప్రతి ఒక్కరూ ఈ-స్టాంపింగ్ చేయించుకోవాల్సి వస్తోంది. జిల్లాలో 11 రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో ఈ స్టాంపింగ్ వ్యవస్థ నడుస్తోంది. జారీ హక్కును ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించడంతో 147 ఈ స్టాంపింగ్ కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నాన్ జ్యుడీషియల్ స్టాంప్ వినియోగాన్ని గతంలో మాదిరిగానే కొనసాగించేందుకు ఆదేశాలు జారీ చేసింది. అయితే మార్చి 17 తరువాత నుంచి స్టాక్ రాలేదు.

### ప్రభుత్వానికి నివేదించాం

**ఎ.నాగలక్ష్మి, డీఐజీ, రిజిస్ట్రేషన్‌శాఖ**

జిల్లాలో పది రూపాయల నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కొరత విషయమై ప్రభుత్వానికి నివేదించాం. ప్రస్తుతం అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనూ సరిపడా ఉన్నాయి. డిమాండ్ నేపథ్యంలో ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాం. త్వరలోనే పరిష్కారం లభిస్తుంది. నిర్దేశించిన మొత్తంతో మాత్రమే వీటి విక్రయాలు జరగాలి. ఎక్కడైనా అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తే సమాచారం ఇవ్వండి. చర్యలు తీసుకుంటాం



# మత విద్వేషాలు రెచ్చగొట్టే కుట్ర

- గోవుల మరణాలపై భూమనది అసత్య ప్రచారం
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున



విలేకరులతో మాట్లాడుతున్న నాగార్జున

చీపురుపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో గోవుల మరణాలపై తప్పుడు ప్రచారం చేస్తున్న వైసీపీ నాయకులు మత విద్వేషాలను రెచ్చగొట్టడానికి కుట్ర పన్నుతున్నారని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున ఆరోపించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది మనోభావాలను దెబ్బతీసేలా భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతున్నారన్నారు. గతంలో వేంకటేశ్వర స్వామిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కరుణాకరరెడ్డి మరోసారి దుష్ప్రచారానికి తెర తీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన చీపురుపల్లిలో విలేకరులతో మాట్లాడారు. గోమాతల మరణాలపై భూమన చేసిన వ్యాఖ్యలను ఖండించారు. హిందూ ధర్మాన్ని, దేవాలయాలను ఎలా కాపాడాలో టీడీపీకి తెలుసునన్నారు. సింహాచలం దేవస్థానంలో ఎన్నో ఆవులు సరైన పోషణ లేక వైసీపీ హయాంలో మరణించాయన్నారు. వారి పాలనలో సుమారు 150 దేవాలయాలు ధ్వంసమయ్యాయని, ఆ సంఘటనలపై నేటి వరకూ దర్యాప్తు లేదన్నారు. గోశాలలో 150 ఆవులు చనిపోయాయని భూమన చేసిన ఆరోపణ నిజం కాదన్నారు. వేరే ప్రాంతంలో తీసిన ఫొటోలను ఇక్కడివిగా చిత్రీకరిస్తున్నారన్నారు. తిరుపతిలో గోవులు మరణిస్తున్నాయనే తప్పుడు ప్రచారంతో వైసీపీ నాయకులు మతాన్ని అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేస్తున్నారని, ఇది మంచిది కాదన్నారు.



ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న నాయకులు

## 'ఉపాధికి అర్థమే మారిపోయింది'

కొత్తవలస, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం అర్థమే మారిపోతోందని సిటు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, జిల్లా వ్యవసాయ కార్మికసంఘ కార్యదర్శి గాడి అప్పారావు అన్నారు. 13 వారాలు దాటినా ఇంత వరకు వేతనాలు ఇవ్వకపోతే ఎలా బతుకుతారని ప్రశ్నించారు. శనివారం మండలంలోని మిద్ది బంద చెరువులో పనిచేస్తున్న ఉపాధి వేతనదారుల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. గత 13 వారాలుగా తమకు రావలసిన బకాయిలు చెల్లించలేదని వారు గోడు వెళ్లబోసుకున్నారు. దీనిపై వీరు స్పంది స్తూ ఇలా చేస్తే పేదలు ఎలా జీవనం సాగిస్తారని ప్రశ్నించారు.

## కళ్లల్లో కారం కొట్టి..
## పుస్తెలు తెంచుకొని పోయి..

రాజాం రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాజాం మండలంలోని పొగిరిలో ఓ మహిళ కళ్లల్లో కారంకొట్టి మెడలోని బంగారు పుస్తెల తాడు తెంపుకొని పోయిన ఘటన శనివారం చోటుచేసుకుంది. రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ కథనం మేరకు.. పొగిరి గ్రామానికి చెందిన జడ్డు చిన్నమ్మడు స్థానిక ఉన్నత పాఠశాల వెనుక భాగంలో కళ్లంలోని పశువులకు మేత వేస్తోంది. అదే సమయంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన వ్యక్తి ఆమె పక్కనే నిలిపాడు. ఆ వ్యక్తి ఎవరా అని చిన్నమ్మడు చూస్తుండగా ఆమె కళ్లల్లో కారం కొట్టాడు.మంటతో ఆమె కేకలు వేసింది. దీంతో ఏం జరిగిందా అని దగ్గర్లో ఉన్న ఆమె భర్త నరేంద్ర ఘటన స్థలానికి చేరుకున్నాడు. ఏం జరిగిందోనని తెలుసుకునేలోపే ఆ వ్యక్తి రాజాం వైపు వాహనంతో పరారయ్యాడు. మరో వాహనంతో నరేంద్ర వెంబడించినా దొరకలేదు. సుమారు 38 గ్రాములు బంగారు పుస్తెలతాడు తెంపుకొని పోయినట్లు చిన్నమ్మడు రాజాం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సీఐ అశోక్ కుమార్ కేసు నమోదు చేశారు.

## శతశాతం రికవరీలకు చర్యలు తీసుకోండి

రేగిడి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఎస్‌హెచ్‌జీల రుణ ప్రణాళికల్లో అవసరమైనవారికే రుణాలు అందించి శతశాతం రికవరీ ఉండేలా చర్యలు తీసుకోవాలని వెలుగు ఏపీఎం గోవిందరావు కోరారు. శనివారం రేగిడి, అమదాలవలసల్లో ఎస్‌హెచ్‌జీల రుణప్రణాళికపై సభ్యులు, ఎన్యుమరేటర్లతో సమావేశం నిర్వహించారు.

## ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

రేగిడి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం రేగిడి దత్తపీఠంలో దత్తఆశ్రమ నిర్వాహకులు కిమిడి సూరప నాయుడు, కిమిడి రవిబాబు ఆధ్వర్యంలో దివ్యజీవన సత్సంగ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకొండకు చెందిన సత్యసాయిప్రతినిధి ఎన్‌వీ రమణ, దేవుదళగీతాశ్రమం ప్రతినిధి గొర్లె దామోదర్‌రావు, దామోదర్, తినాథరావు రామాయణ, మహాభారతంలో ముఖ్యఘట్టాలపై చర్చించారు.

## అంబాడలో
## శివసాయి ఆలయ వార్షికోత్సవం

రేగిడి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబాడలో శనివారం శివసాయి ఆలయం 19వ వార్షికోత్సవం గ్రామస్థు నిర్వహించారు. ఆలయ అర్చకులు బి.నరసింహమూర్తి, ఆర్. ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో మండలపారాధన, కుంకుమపూజలు, హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మకర్త వీరాచారి అనురాధ దంపతులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణలో
## సీసీ కెమెరాల పాత్ర కీలకం



ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాల పాత్ర ఎనలేనిదని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. వీటిని ఏర్పాటు చేసేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. పబ్లిక్, ప్రైవేటు స్థలాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో దొంగతనాలు, ఇతర నేరాలు జరగకుండా నియంత్రించవచ్చునన్నారు. పాఠశాలలు, విద్యాలయాలు, ఆసుపత్రులు, ముఖ్య కూడళ్లు, వాణిజ్య సముదాయాలు, అపార్టుమెంటుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల ప్రజల భద్రతకు భరోసా లభిస్తుందన్నారు. జిల్లాలో నూతనంగా 3 వేల సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలనేది లక్ష్యమని తెలిపారు. ఇప్పటి వరకూ జిల్లా వ్యాప్తంగా స్థానికుల సహకారంతో 2,125 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు.

## ఘనంగా షిర్డీ సాయి
## ఆలయ వార్షికోత్సవం

జామి,ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పావాడ గ్రామంలోని శ్రీషిరిడి సాయి ఆలయ 13వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. సాయినాథునికి ప్రత్యేక పూజలు, అన్నసమారాధన నిర్వహించారు.



సాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు

# ఆక్రమణల తొలగింపుపై వాగ్వాదం

- రంగప్ప చెరువులో పనులు నిలిపివేసిన అధికారులు
- తమ భూములే అంటున్న సాగుదారులు



పనులు అడ్డుకుంటున్న సాగుదారులు

రాజాం రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రంగప్ప చెరువుగర్భంలో శనివారం అధికారులు, సాగుదారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సుమారు 12 ఎకరాల మేర ఆక్రమణలకు గురికావడంతో తొలగిస్తామని యంత్రాలతో వెళ్లిన అధికారులను ఆ భూములు తమవేనని సాగుదారులు అడ్డుకున్నారు. దీంతో అధికారులు, సాగుదారుల మధ్య సుమారు గంటన్నర సేపు వాగ్వాదం చోటుచేసుకుంది. సాగుదారులు యం త్రానికి అడ్డంగా నిలిచిపోవడంతో ఆక్రమణల తొలగింపు ప్రక్రియను అధికారులు తాత్కాలికంగా వాయిదా వేశారు.

**నోటీసులు జారీచేసినా..**

పూర్వపు సారధి మేజర్ పంచాయతీ పరిధిలోని రంగప్ప చెరువు వెనుక భాగంలో కొంతమంది వ్యక్తులు ఆక్రమించి సుమారు రెండు దశాబ్దాలుగా పొలాలుగా మార్చి సాగు చేసుకుంటున్నారు. అయితే ఇటీవల మునిసిపల్ యంత్రాంగం వాటిని గుర్తించి సర్వేయర్‌తో సర్వే చేయించి ఆక్రమణలుగా నిర్ధారించింది. ఈ విషయాన్ని రాజాం తహసీల్దార్ కృష్ణంరాజుకు మునిసిపల్ కమిషనర్ అప్పలనాయుడు నివేదించారు. రెండు నెలల కిందట మునిసిపల్ యంత్రాంగం ఆక్రమిత భూముల్లో జెండాలు పాతింది. మునిసిపల్ కమిషనర్ నివేదిక ప్రకారం ఆక్రమణలుగా పేర్కొంటున్న భూములను సాగుచేస్తున్న వారికి రెవెన్యూ యంత్రాంగం నోటీసులు జారీ చేసింది. అయినా వారిలో స్పందన లేకపోవడంతో మునిసిపల్, రెవెన్యూ అధికారులు, వీఆర్వోలతో కలిసి శనివారం ఆక్రమిత భూములు చదును చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. అయితే ఆ భూములు తమవేనని, రెండు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్నామని సాగుదారులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఎట్టి పరిస్థితుల్లో భూములను చదును చేయనివ్వమని యం త్రానికి అడ్డంగా నిల్చొని అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో భూములకు సంబంధించి మీదగ్గర ఉన్న పత్రాలను తహసీల్దార్‌కు అందించాలని, ఆయన ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని రెవెన్యూ, మునిసిపల్ యంత్రాంగం పనులు నిలిపివేసి వెనుదిరిగారు.



మస్తర్లను పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

## మస్తర్లలో తేడాలొస్తే చర్యలు

రాజాం,ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మస్తర్లల్లో తేడాలు వస్తే ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు తెలిపారు.శనివారం పెనుబాకలో జరుగుతున్న చెరువు పనులను పరిశీలించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ వేతనదారులు ప్రతి రోజూ ఉదయం సమయానికి హాజరుకావాలి కోరారు.

## ఎస్.కోటలో శాంతి ర్యాలీ

శృంగవరపుకోట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట పట్టణంలో శనివారం క్రైస్తవులు శాంతి ర్యాలీ నిర్వహించారు. పగడాల ప్రవీణ్ అకాల మరణం ఎంతో బాధించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ రాజు, డేవిడ్‌పాల్, బిషప్ విభూషణం, దేవప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




శాంతి ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

## మద్యపానంతో సమస్యలు

కొత్తవలస, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగడం వల్ల కార్మికులు అనేక దుష్పరిణామాలను ఎదుర్కోవలసి ఉంటుందని కొత్తవలస ఎక్సైజ్ సీఐ జీఎస్ రాజశేఖర నాయుడు అన్నారు. శనివారం కంటకాపల్లిలోనున్న శారదా మెటల్స్ అండ్ అల్లాయిస్ కర్మాగార కార్మికులక మద్య పానం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. కార్మికులు మద్యపానానికి ఎంత దూరంగా ఉంటే అంత మంచిదన్నారు.

## 150 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

కొత్తవలస, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పన్నదొరపాలెం పంచాయతీ జోడుమెరకలో నిర్వహించిన దాడులలో 150 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు ఎస్‌ఐ రమ్య తెలిపారు. గ్రామంలో నాటుసారా వండినా, అమ్మినా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మార్క్‌శంకర్
## కోలుకోవాలని పూజలు



వృద్ధులకు అల్పాహారం అందిస్తున్న దృశ్యం

నెల్లిమర్ల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కుమారుడు మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ నెల్లిమర్లకు చెందిన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం స్థానిక ఫ్లైఓవర్ వద్ద ఉన్న హనుమాన్ విగ్రహం వద్ద 101 కొబ్బరి కాయలు కొట్టారు. వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద కూడా 101 కొబ్బరి కాయలు కొట్టారు. కుసుమంచి వృద్ధాశ్రమంలో వృద్ధులకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఆవాల పూడి రాజు, పక్కి నాగరాజు, సిరిగుడి వాసుదేవరావు, మజ్జి రాంబాబు, పైడి శ్రీను, అదపాక చిన్న తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నీ విజేత మంగళాపురం

రేగిడి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరనాయుడువలసలో కిరణ్, సూర్య మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా పాలకొండ మండలంలోని మంగళాపురం జట్టు నిలిచింది. శనివారం నిర్వహించిన ఫైనల్‌లో ఉప్పరనాయుడువలస, మంగళాపురం జట్లు తలపడగా మంగళాపురం జట్టు విజేతగా, రన్నర్‌జట్టుగా ఉప్పరనాయుడువలస నిలిచాయి. ఈ నెల ఆరో తేదీ నుంచి నాకౌట్ పద్ధతిలో జరిగిన టోర్నీలో రేగిడి, సంతకవిటి, పాలకొండ, రాజాం మండలాలకు చెందిన 16 జట్లు పాల్గొన్నాయి. విజేతగా నిలిచిన జట్టుకు 11066, రన్నర్‌కు రూ.6666లు సర్పంచ్ కరణం లక్ష్మీ గోవిందరావు, ఎంపీటీసీ పొగిరి అప్పలనాయుడులు అందజేశారు.



మంగళాపురం జట్టుకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

# జావాంలో పగడాలమ్మ తల్లి జాతర

సంతకవిటి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జావాంలో పగడాలమ్మతల్లి 26వ జాతర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. జాతరకు ఉత్తరాంధ్ర జిల్లాల నలుమూలలు నుంచి భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లిస్తున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు, పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. కాగా పగడాలమ్మ ఆలయ ఆవరణలో విజయనగరం వాలీబాల్ అసోసియేషన్ సెక్రటరీ కె.రామచంద్రుడు ఆధ్వర్యంలో అంతర్‌జిల్లా వాలీబాల్ పోటీలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. ఈ పోటీలకు విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం, మన్యం పార్వతీపురం, అరకు వాలీబాల్ జట్లతో పాటు జావాం జట్టు బరిలో దిగాయి.



వాలీబాల్ పోటీల దృశ్యం

## నేడు మంత్రి
## కొండపల్లి శ్రీనివాస్ జన్మదిన వేడుకలు

విజయనగరం రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం నగరంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఉదయం 7.30 గంటలకు విజయనగరంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 8 గంటలకు విజయనగరం ఫూల్‌బాగ్ కాలనీ వద్ద వున్న చెవిటి, మూగ, అంధుల స్కూల్‌ని సందర్శించి వారితో కలిసి పుట్టిన రోజు వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం 9.30 గంటలకు గజపతినగరం పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారు. గజపతినగరంలోని బెల్లాన కన్వెన్షన్ సెంటర్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. సాయంత్రం 4 గంటలకు విజయనగరం మహారాజా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేయనున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి విజయనగరంలోని పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారు.

## రేపటి నుంచి
## సంపత్ వినాయక ఆలయ వార్షికోత్సవం

విజయనగరం రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కొత్తపేటలో ఉన్న సంపత్ వినాయక దేవాలయం వార్షికోత్సవాన్ని సోమవారం నుంచి నిర్వహించనున్నట్టు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త యడ్ల పైడిరాజు చెప్పారు. శనివారం ఆలయ కమిటీ ప్రతినిధులతో దేవాలయ ప్రాంగణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమిళ సంప్రదాయం ప్రకారం మూడు రోజుల పాటు ప్రత్యేక హోమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

## ద్వారపూడిలో ఉచిత వైద్య శిబిరం

విజయనగరం రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ద్వారపూడి సచివాలయంలో సామాజిక వైద్య విభాగం, విజయనగరం ప్రభుత్వ మెడికల్ కళాశాల కుటుంబ దత్తత కార్యక్రమంలో భాగంగా శనివారం రాకోడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్లు సాయికుమార్, పి.మాధురి, తిరుమలరావు తదితరులు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షలు చేయించుకుని అవసరమైన 78 మందికి ఉచితంగా మందులు అందజేశారు.

## పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

విజయనగరం దాసన్నపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి రావల్సిన ఉపాధి హామీ పథకం పెండింగ్ బిల్లులు కేంద్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ డిమాండ్ చేశారు. శనివారం ఆర్ అండ్ బీ సమీపంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రూ.2,090 కోట్లు పెండింగ్ ఉన్నాయని... విజయనగరం జిల్లాలో రూ.111 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నాగభూషణం, రాజు, బూర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

విజయనగరం క్రైం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా సెలవు ప్రకటించినందున జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను రద్దు చేస్తున్నట్టు ఎస్పీ వకుల్ జిందాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

## మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

విజయనగరం క్రైం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రైల్వే స్టేషన్ రోడ్డులోని నవరంగ బార్ అండ్ రెస్టారెంట్ సమీపంలో అర్ధరాత్రి మద్యం విక్రయాలు చేస్తున్నట్టు వచ్చిన సమాచారంతో దాడి చేసి 109 మద్యం సీసాలను, రూ.2,860 నగదును స్వాధీనం చేసుకున్నట్టు సీఐ శ్రీనివాస్ తెలిపారు. పట్టుబడ్డ వ్యక్తితో పాటు షాప్ యజమాని, సూపర్‌వైజర్‌పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

## బ్రాహ్మణ సేవా సంఘం కార్యదర్శిగా శ్రీనివాస్

విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ 12 ( ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ సేవా సంఘం ప్రచార విభాగం రాష్ట్ర కార్యదర్శిగా గన్నవరపు వెంకట శ్రీనివాస్‌ను నియమించినట్టు సమాఖ్య ప్రధాన కార్యదర్శి మనోహరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను సమాఖ్య సభ్యులు అభినందించారు.

## స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు

విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): నగరంలో అంబటి సత్తర్వు జంక్షన్ నుంచి నీళ్లట్యాంకు జంక్షన్ వరకూ ఉన్న ప్రధాన రహదారిపై స్పీడు బ్రేకర్లు ఏర్పాట్లు చేస్తున్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య ఆదేశాలతో శనివారం ఇంజనీరింగ్ సిబ్బంది స్పీడ్ బ్రేకర్ల పనులు చేపట్టారు.

## పోస్టర్లు లేని నగరంగా తీర్చిదిద్దాలి

విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పోస్టర్లు లేని నగరంగా తీర్చిదిద్దే ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి .నల్లనయ్య కోరారు. శనివారం ఆయన ఆదేశాలతో నగరంలోని వివిధ ప్రాంతాల్లో గోడలపై ఉన్న పోస్టర్లను సిబ్బంది తొలగించారు. గోడ మీద రాతలను కూడా చెరిపివేశారు. ఈ సందర్భంగా కమిషనర్ నల్లనయ్య మాట్లాడుతూ ఈసారి వీటిని అతికించే సంస్థలకు నోటీసులు జారీ చేయడంతో పాటు అపరాధ రుసుం విధిస్తామని హెచ్చరించారు.

## పైపులైన్‌కు మరమ్మతులు

విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పైపులైన్లకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపడుతున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య అన్నారు. శనివారం కొత్తపేట జంక్షన్ వద్ద పైపులైను లీకేజీలకు మరమ్మతులు చేయించారు. సచివాలయాల వారీగా నీటి నాణ్యత పరీక్షలు జరిపిస్తున్నామన్నారు.

## వైద్య సేవలపై అధ్యయనం

విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తరఫున ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై లోతైన అధ్యయనం కోసం వివిధ రాష్ట్రాల ప్రతినిధులను కేంద్ర ప్రభుత్వం నగరానికి పంపింది. నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్స్ కమిటీ సభ్యులైన డాక్టరు గౌరవ్ త్రిపాఠి, డాక్టర్ సుధీర్ శుక్లాదాస్‌లు రెండు రోజుల పర్యటన నిమిత్తం శనివారం జిల్లా కేంద్రానికి వచ్చారు. ఈ సందర్భంగా వీరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు తనిఖీ చేయడంతో పాటు హెల్త్ సెక్రటరీలు, ఏఎన్ఎంలు, ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. జొన్నగుడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుతున్న వైద్య సేవలు ,మందులు పరిస్థితి, వైద్య పరికరాల పనితీరును పరిశీలించారు. అనంతరం ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ర్యాంకింగ్‌లను నమోదు చేస్తారు. మరో వారం రోజుల్లో వేరొక బృందం రానుందని వైద్య బృందం తెలిపింది.

## నవధాన్యాలు పండించండి

కొత్తవలస, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ద్వారా నవధాన్యాలను సాగు చేయడం రైతులకు ఖర్చు తగ్గి ఆరోగ్యకరమైన పంటలను పండించ వచ్చునని ప్రకృతి వ్యవసాయం ఏపీఎం వెంకట రమణ అన్నారు. శనివారం దేవాడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయం పంటలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గంతకో లక్ష్మి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## అయ్యప్ప ఆలయం పరిశీలన

చీపురుపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీకనకమహలక్ష్మి ఆలయ సమీపంలో నిర్మాణంలో ఉన్న అయ్యప్పస్వామి దేవాలయాన్ని శబరిమల మాలికాపురిమాత దేవాలయ మున్ మేల్ శాంతి ఎంఎస్.రెజికుమార్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ విశేషాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట అఖిల భారత అయ్యప్ప ధర్మ సభ రాష్ట్ర కార్యదర్శి శికకుమార్, వానపల్లి నాగేశ్వరరావు, రాజేశ్వరరావు, ధర్మశాస్త్ర ట్రస్ట్ బోర్డు సభ్యులు ఎస్వీజీ శ్రీనివాసరావు, అప్పికొండ ఆదిబాబు, దాసరి రవి, దిలీప్‌కుమార్ ధనూకా, గవిడి నాగరాజు, బెల్లాన శ్రీనివాసరావు తదితరులున్నారు.

## పోడలిలో మల్లేశ్వరస్వామి
## ఆలయం పునఃప్రారంభం

సంతకవిటి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): చిత్తారపురం పంచా యతీ పరిధిలో గల పోడలిలో శనివారం మల్లేశ్వరస్వామి ఆలయాన్ని పునః ప్రారంభించారు. గ్రామంలో రెండు శతాబ్దాలుగా శిథిలావస్థలో ఉన్న ఆలయాన్ని పునర్నిర్మాణం చేసి ప్రతిష్ఠించారు. భోగవరపు గురునాథరావు శర్మ పర్యవేక్షణలో, వల్లభరావు శర్మ ఆధ్వర్యంలో నుసరాపు చంద్రశేఖరశర్మ పూజలు నిర్వహించారు.

# ఓఎస్‌సీలను పాఠశాలల్లో చేర్పించండి

● ఇన్‌చార్జి జిల్లా విద్యాశాఖాధికారి రమాజ్యోతి




మాట్లాడుతున్న రమాజ్యోతి

సీతానగరం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఔట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్ (ఓఎస్‌సీ)ను వెంటనే పాఠశాలల్లో చేర్పించాలని ఇన్‌చార్జి జిల్లా విద్యాశాఖాధికారి రమాజ్యోతి కోరారు. శనివారం మండలంలోని లచ్చయ్యపేట, చినబోగిలి మండల పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు బూర్జ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓఎస్‌సీను వెంటనే స్కూల్‌లో జాయిన్ చేయాలని గతంలో ఆదేశాలు జారీ చేశామన్నారు. ఓఎస్‌సీ విద్యార్థులకు స్కూల్‌కు రెగ్యులర్‌గా వస్తున్నది లేనిది సిబ్బందిని అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు సూరిదేముడు, మువ్వల వెంకటరమణ, ప్రధానోపాధ్యాయులు, పాఠశాలల సిబ్బంది, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

## రెగ్యులర్ పీవోలను నియమించాలి

కురుపాం, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ ప్రాంతంలో సమస్యలు పరిష్కారించాలని మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజ్ కోరారు.ఈ మేరకు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి దృష్టికి పలు సమస్యలను తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా జయరాజ్ మాట్లాడుతూ సీతంపేట,పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టుల్లో రెగ్యులర్‌ప్రాజెక్టు అధికారులను నియమించాలని కోరినట్లు తెలిపారు.

## తోటపల్లిలో భక్తుల సందడి



వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

గరుగుబిల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): తోటపల్లిలోని వేంకటేశ్వర, కోదండ రామస్వామి ఆలయాల్లో శనివారం భక్తుల సందడి నెలకొంది. ఆలయ ప్రధాన అర్చకులు వీవీ అప్పలాచార్యులు సుప్రభాత సేవ, విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, శాత్తుమురైతో పాటు పలు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ ప్రత్యేక చర్యలు చేపట్టారు.

## 'తప్పుడు కేసులు పెట్టడం సరికాదు'

గుమ్మలక్ష్మీపురం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్తలపై పోలీసులు తప్పుడు కేసులు పెట్టడంపై సరికాదని మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పా శ్రీవాణి పేర్కొన్నారు. శనివారం ఎల్విన్‌పేట పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ను కలిశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పోలీసులు తమ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ఆఆమె వెంట సర్పంచ్‌లు శంకరరావు, చైతన్య ప్రసవంతి, నాయకులు నిమ్మక గోపాల్, ఎంపీపీలు దీనమయ్య, పద్మావతి ఉన్నారు.

## ఏసు భక్తుల పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న దృశ్యం

భామిని, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి):బత్తిలి ఆర్‌సీఎం చర్చి నుంచి ఇసుకగూడ ప్రేమగిరి చర్చి వరకు శనివారం ఏసుక్రీస్తు భక్తులు పాదయాత్ర నిర్వహించారు. తపస్సు దక్షలో భాగంగా ఏసు శిలువ, కొవ్వొత్తులతో ప్రార్థనలు చేసి ప్రేమగిరి మేరీమాత చర్చి బత్తిలి ఫాదర్ సంజీవ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు.కార్యక్రమంలో బత్తిలి, గురండి, భామిని, అనంతగిరి, బాలేరు, నల్లరాయిగూడ తదితర గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి సర్వే

●సెర్ప్ రాష్ట్ర అదనపు సీఈవో శ్రీరాములునాయుడు



ఎస్‌హెచ్‌జీలతో సమావేశం నిర్వహించిన శ్రీరాములునాయుడు

పాచిపెంట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ఏర్పాటుచేసిన ప్రత్యేక యాప్ ద్వారా ఎన్యుమరేటర్ల ద్వారా సర్వే చేపట్టినట్లు సెర్ప్ రాష్ట్ర అదనపు సీఈవో కె.శ్రీరాములునాయుడు తెలిపారు. శనివారం మండలంలోని అమ్మవలసలో ఎన్యుమరేటర్లు గంగమ్మ గ్రామ సంఘం పరిధిలో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో 1.50 లక్షల ఎన్యుమరేట్లను నియమించి సర్వే నిర్వహిస్తున్నారని చెప్పారు. వార్షిక అప్పులు, జీవనోపాధి, ప్రణాళికలపై యాప్ ద్వారా సర్వే చేస్తున్నారని తెలిపారు. మహిళా సంఘాల సభ్యులు గ్రూపుగా ఏర్పడి ఆదాయం వచ్చే యాక్టివిటి నిర్వహిస్తే అధిక ఆదాయం వస్తుందని, ఆ విధంగా ఆలోచించాలని కోరారు. ప్రస్తుతం స్త్రీనిధి పథకంలో తీసుకున్న రుణాలకు 0.90 శాతం వడ్డీ పడగా, ఆ వడ్డీని 0.70 శాతానికి తగ్గించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు.కార్య క్రమంలో మన్యం జిల్లా డీఆర్‌డీఏ పీడీ సుధారాణి, ఇన్‌చార్జి ఏసీ శివుడునాయుడు, రామకృష్ణ, కె.భాస్కరరావు పాల్గొన్నారు.

## ఎన్యుమరేటర్లతో సర్వే

మక్కువ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాలు ఆర్థికాభివృద్ధి చెందాలని సెర్ప్ రాష్ట్ర అదనపు సీఈవో కె.శ్రీరాములునాయుడు పిలుపునిచ్చారు.శనివారం మండలంలోని చెముడులో సెర్ప్ ఆధ్వర్యంలో జరుగుతున్న సర్వేనుపరిశీలించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం వార్షిక అప్పులు, జీవనోపాధి ప్రణాళికపై ప్రత్యేక యాప్ రూపొందించి రాష్ట్ర వ్యాప్తంగా లక్షా 50 వేల మంది ఎన్యుమరేటర్లను ఏర్పాటు చేసి సర్వే నిర్వహిస్తున్నారన్నారు. మహిళా సంఘాలు ఆర్థికాభివృద్ధి సాధిస్తేనే కుటుంబాలు ప్రశాంత వాతావరణంలో జీవనం సాగిస్తాయన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సుధారాణి, ఏసీ శివన్నాయుడు పాల్గొన్నారు.

## సర్వే వేగవంతంగా పూర్తి చేయాలి

పార్వతీపురం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలకు రుణాలు అందించేందుకు రుణ ప్రణాళిక సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని సెర్ప్ రాష్ట్ర అదనపు సీఈవో రెడ్డి శ్రీరామనాయుడు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. శనివారం సీతానగరం మండలం చిన్నరాయుడుపేటలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా డ్వాక్రా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకొని ప్రతి మహిళ ఆర్థికగా అభివృద్ధి చెందాలని కోరారు.

# పర్యవేక్షణ లేక.. పక్కదారి పట్టి

● శివ్వాంలో జేజేఎం పైపులైన్లకు గండి కొట్టి పెరటి తోటలకు నీరు మళ్లింపు ● నీరుగారుతున్న పథకం లక్ష్యం



పెరటి తోటకు జలజీవన్ మిషన్ పథకానికి సంబంధించిన పైపులైన్ ఏర్పాటుచేసిన దృశ్యం

గరుగుబిల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివ్వాంలో తాగునీటి ఎద్దడి నివారణకు జేజేఎం పథకం ద్వారా ఏర్పాటుచేసిన పైపులైన్ల ద్వారా నీరు పెరటి తోటలకు కొందరు వినియోగిస్తున్నారు. ప్రధానంగా ప్రజల దాహార్తినితీర్చాల్సిన నీటి నిర్వహణపై పర్యవేక్షణ లేకపోవడంతో దారి మళ్లిస్తున్నారని పలువురుగ్రామస్థులు వాపోతున్నారు. శివ్వాంలో రహదారికి ఆనుకుని పలువురు రైతులు పెరటి తోటలు సాగుచేస్తున్నారు. వీరు జేజేఎం పథకం నిధులతో ఏర్పాటుచేసిన పైపులైన్‌కు గండి కొట్టి ప్రత్యేకంగా పైపు ఏర్పాటు చేసి ఆరునెలలుగా కూరగాయల తోటలకు నీటిని మళ్లిస్తున్నారు. ప్రస్తుతం వేసవిలో తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్న సమయంలో కూరగాయల తోటలకు జల జీవన్ మిషన్ నుంచి నీటిని తరలిస్తుండడంపై పలువురు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇక్కడ రెండు వీధులకు మాత్రమే పూర్తిస్థాయిలో నీరందుతోందని పలువురు చెబుతున్నారు. మిగతా మూడు వీధులకు అరకొరగా సరఫరాచేస్తున్నారని మహిళలు వాపోతున్నారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి బంటు అప్పారావు దృష్టికి పలు దఫాలు తీసుకువెళ్లినా స్పందించలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల దాహార్తిని తీర్చాలన్న లక్ష్యంతో ప్రభుత్వం లక్షలాది రూపాయలతో ఏర్పాటుచేసిన జేజేఎం లక్ష్యం నీరుగారుతోంది. కాగా క్షేత్రస్థాయిలో పరిశీలించి, చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో జి.పైడితల్లి తెలిపారు.

### ట్యాపులు మరిచారు

శివ్వాంలో గతంలో జలజీవన్ మిషన్ పథకంలో ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేశారు. అయితే తాగునీరుసరఫరాకు సంబంధించి ట్యాప్‌లు అమర్చలేదు. ట్యాప్‌లు ఏర్పాటు చేయకపోవడంతో తాగునీరు వృథాగా పోతోందని పలువురు వాపోతున్నారు.

# ఆరుబయట.. రేకుల షెడ్ల కింద

●పక్కాభవనాలు లేక విద్యార్థులకు తప్పని అవస్థలు ●ఇదీ బొడ్డగూడ, బురజోల పాఠశాలల దుస్థితి



బొడ్డగూడ పాఠశాలలో ఆరుబయట అభ్యసిస్తున్న విద్యార్థులు

భామిని, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో బొడ్డగూడ, బురజోలు ప్రాథమిక పాఠశాలల్లో సమస్యలు తిష్ఠవేశాయి. ఇక్కడ పక్కా భవనం లేకపోవడంతో విద్యారులు అవస్థలు పడుతున్నారు. ఆరుబయట చెట్లు, రేకుల షెడ్ల కింద బోధన సాగుతోంది.



బురుజోల రేకులషెడ్‌లో పాఠశాల నిర్వహిస్తున్న దృశ్యం

**కమ్యూనిటీ భవనంలో...**

భామిని మండలానికి కూతవేటు దూరంలో ఉన్న బొడ్డగూడ పాఠశాలలో చెట్ల కింద బోధన సాగుతోంది. బొడ్డగూడ గిరిజన గ్రామంలోని ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరడంతో కమ్యూనిటీ భవనంలో ఒక వైపు పాఠశాల మరో వైపు సచివాలయం నిర్వహిస్తున్నారు. దీంతో ఆ భవనంలో ఒకే గదిలో ఐదు తరగతులు బోధించడం ఇబ్బందిగా ఉండడంతో ఆరుబయట చెట్ల కింద నీడలో తరగతులు నిర్వహణతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బొడ్డ గూడపాఠశాలలో నాడు-నేడు పథకం కింద పాఠశాల భవనాల నిర్మాణాలు ప్రారంభించడంతో గ్రామస్థులు ఎంతోగానో ఆనందించారు. అయితే అర్ధాంతరంగా నిలిచిపోవడంతో పనులు పూర్తిచేయాలని ఐటీడీఏ, విద్యాశాఖ అధికారులకు ఆదివాసీలు విన్నవించిన విషయం విదితమే. ఇక్కడ పాఠశాలలో 68 మంది అభ్యసిస్తున్నారు.

బురుజోల ప్రాథమిక పాఠశాలలో సమస్యలు తిష్ఠవేశాయి. ఇక్కడ భవనం శిథిలావస్థకు చేరుకుంది. వర్షం కురిస్తే గదుల్లో నీరు చేరుతోంది. దీంతో రేకులు విరిగిపోవడం విద్యార్థి తల్లిదండ్రులు ఆ రేకులు అమర్చడంతో విద్యార్థులు తలదాచుకుంటున్నారు.67 మంది చదువుతున్న ఈ పాఠశాల రెండోవిడత నాడు-నేడు పథకం కింద మంజూరైన, సొమ్ము మాత్రం పాఠశాలకు జమకాలేదని హెచ్ఎం సూర్యనారాయణ చెబుతున్నారు. వచ్చిన ఫర్నిచర్ గదులు, వరండాల్లో ఏర్పాటు చేశారు.ఇప్పటికైనా బురజోల, బొడ్డగూడలో పాఠశాలల భవన నిర్మాణాలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. కాగా నాడు-నేడు పనుల్లో పురోగతికి విడతల వారీగా రావాల్సిన నిధులు రావడం లేదని భామిని ఇంజనీరింగ్ అసిస్టెంట్, బి.ప్రమోద్ చెప్పారు. బొడ్డగూడ పాఠశాల భవనం పిల్లర్ల వరకు జరిగాయని, నిధులు వస్తే ప్రభుత్వ మార్గదర్శకాలు మేరకు పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

# గోవుల మరణాలపై వైసీపీ అసత్య ప్రచారం

●మత విద్వేషాలు రెచ్చగొట్టే కుట్ర ● మంత్రి సంధ్యారాణి



మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు,ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): టీటీడీలో గోవుల మరణాలపై వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. శనివారం సాలూరులో విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది మనోభావాలు దెబ్బతీసేలా టీటీడీపై వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో సింహాచలంలో గోమరణాలు ఎన్ని జరిగాయో అందరికీ తెలుసని పేర్కొన్నారు. గతంలో వేంకటేశ్వరునిపై వైసీపీ నాయకులు అనేక విమర్శలు చేశారని గుర్తుచేశారు. గోశాలలో వంద ఆవులు చనిపోయాయని వైసీపీ నాయకులు చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తమని తెలిపారు. గోసంరక్షణ శాలపై తిరుమల తిరుపతి దేవస్థానం ప్రత్యేక దృష్టి పెట్టడంతోపాటు గోవులు సంరక్షణకు తీసుకుంటున్న చర్యలపై క్రమం తప్పకుండా సమీక్ష జరుగుతుందని చెప్పారు. టీటీడీ గోశాలలో 260 మందికిపైగా ఉద్యోగులు పని చేసి గోవులను సంరక్షిస్తున్నారని, ఇటువంటి తప్పుడు ప్రచారం చేయడం సరికాదని హితవు పలికారు.గోశాలలో ఉన్న 2,668 ఆవులకు జియోట్యాగ్ చేసి రోజూ పర్యవేక్షిస్తున్నారని, ఆవులకు జియోట్యాగ్ తీసేశారని వైసీపీ నాయకులు విషప్రచారం చేయడం సరికాదన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టడంతోపాటు టీటీడీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా అసత్య ఆరోపణలు చేస్తుండడంతో చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# సమస్యల పరిష్కారమే ధ్యేయం

● ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి



అర్జీదారుడితో మాట్లాడుతున్న తోయక జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కార ధ్యేయంగా పభుత్వం పనిచేస్తోందని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. శనివారం గుమ్మలక్ష్మీపురంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు వచ్చి వినతులను సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమస్యను ఆలకించి సంబంధిత అధికారులు దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు. ఏదిఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

**హేతుబద్ధీకరణలో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేయాల్సిన ఉద్యోగులు**

| కేటగిరీ | జనాభా | సాధారణ ప్రయోజన (మల్టీపర్పస్) | నిర్దిష్ట ప్రయోజన (టెక్నికల్) | మొత్తం ఉద్యోగులు |
|---|---|---|---|---|
| ఏ | 2,500లోపు | 2 | 4 | 6 |
| బీ | 2,501-3500 | 3 | 4 | 7 |
| సీ | 3,500 పైన | 4 | 4 | 8 |

## సచివాలయ ఉద్యోగుల్లో గందరగోళం

(7వ పేజీ తరువాయి)

ఉంచారు. ఇలా ఇద్దరినీ ఒక చోట తప్పిస్తే, మరో చోట మరో ఇద్దరిని తప్పించారు. బి కేటగిరికు చెందిన సచివాయాల్లో ఒక చోట మహిళ పోలీస్‌ను, మరో చోట వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్‌ను తగ్గించారు. ఇలా తప్పించిన సచివాలయ ఉద్యోగులకు ఎటువంటి బాధ్యతలను అప్పగించనున్నారో స్పష్టత లేకపోవడంతో పాటు సచివాలయానికి నలుగురు నిర్దిష్ట ప్రయోజన ఉద్యోగులు ఉండాలని సూచించిన ప్రభుత్వం ఏడు శాఖల్లో ఏ శాఖకు చెందిన ఉద్యోగుల విధులు నిర్వర్తించాలో చెప్పకపోవడంతో గందరగోళంగా మారింది.

## సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ: ఎస్పీ



ఎస్పీకి సీసీ కెమెరాలు అందజేస్తున్న దృశ్యం

బెలగాం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : నేరాల నియంత్రణ, నేరస్థులను కనిపెట్టడంలో, శాంతి భద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నాయని ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి తెలిపారు.శనివారం పార్వతీపురంలో పాచిపెంటకు చెందిన నల్లి షణ్ముఖ రూ.1.20 లక్షల విలువ గల 40 సీసీ కెమెరాలను ఎస్పీకి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల భద్రతకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో పార్వతీపురం ఏఎస్పీ అంకితా సురాన, ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి,సీఐలు రంగనాధం, ఆదాం, అప్పల నాయుడు, రామకృష్ణ పాల్గొన్నారు.

## చికిత్సపొందుతూ యువకుడి మృతి

పాలకొండ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి):మండలంలోని వీపీరాజుపేట జంక్షన్ సమీపంలో జరిగిన రోడ్డుప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్సపొందుతూ మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. శనివారం పాలకొండ మండలంలోని వీపీ రాజు పేట జంక్షన్ సమీపంలో కోటిపల్లికి చెందిన గొర్లె మోహన్‌రావు (24) ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. ఆ సమయంలో ఓ స్కూల్ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా ఆయన గాయపడ్డాడు. ఈ మేరకు పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మోహన్‌రావు మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 20 లీటర్ల సారా స్వాధీనం

కురుపాం,ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి):కురుపాంలో 20 లీటర్లు సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పి.నారాయణరావు తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వాసుపత్రి రోడ్డు వద్ద వాహనలు తనిఖీ నిర్వహిస్తుండగా శివ్వన్నపేట వెళ్తున్న ఆటోలో 20 లీటర్లు సారా స్వాధీనం చేసుకుని గుమ్మలక్ష్మీపురం మండలం కొందుకుప్ప గ్రామానికిచెందిన పట్టసింగి బలరామ్‌ను అరెస్టుచేసినట్లు తెలిపారు.

## ఘనంగా హనుమాన్ జయంతి

సాలూరు,ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో హనుమాన్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పలు అభయ అంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## పంచాయతీ సెక్రటరీల జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కోటేశ్వరరావు

వీరఘట్టం,ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నడుకూరు పంచాయతీ సెక్రటరీల బొత్స కోటేశ్వరరావు జిల్లా అసోసియేట్ ప్రెసిడెంటగా ఎన్నికయ్యారు. శనివారం పార్వతీపురంలో పంచాయతీ సెక్రటరీల కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. ఈమేరకు ఈమేరకు కోటేశ్వరరావుకు ఎంపీడీవో బి.వెకటరమణ, పంచాయతీ సెక్రటరీలు అభినందించారు.